కథ

# ది సీక్రెట్

డి.వాణీప్రభ

**అది దక్షిణ అమెరికాలోని ఒక సీపోర్ట్.**

**సామాను ఎక్కిస్తూ, దింపుకుంటూ కూలీలు, సూట్‌కేస్‌లు పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ ఛోటామోటా బాబులు- మధ్యలో గాలి వీచినప్పుడల్లా ముక్కుకి రాసుకుంటూ చేపలవాసన...**

**వీటన్నింటికీ అతీతంగా మూడంతస్తుల 'బ్లూకేజిల్' షిప్ హారన్ గట్టిగా మ్రోగించి నెమ్మదిగా బయలుదేరింది. అట్లాంటిక్ సముద్రంలో 20 రోజుల ప్రయాణం తర్వాత అది ఐరోపాలోని గ్రేట్‌బ్రిటన్‌కి చేరుతుంది. 200మంది షిప్‌క్రూ, 180 సింగిల్ బెడ్‌రూమ్స్, 1500 మంది ప్రయాణీకులతో బ్లూకేజిల్ పెళ్లివారిల్లులా ఉండడమే కాదు చిన్న చిన్న బ్లూలైట్స్‌తో అలంకరించబడి ధగధగా మెరిసిపోతోంది. మందంగా వీస్తున్న గాలితోపాటు నెమ్మదిగా అలల మీద తేలుతూ, సయ్యాటలాడుతూ చూపరులను ఆకర్షిస్తూ క్రమంగా కనుచూపు మేర దాటి సముద్రంలో చుక్కలా కన్పిస్తూ అదృశ్యమైపోయింది.**

* * *

"వ్హాట్?" పెద్దగా గావుకేక వేసాడు రాబర్ట్. ఆఫీస్‌లో స్టాఫ్ అంతా అతనికేసి తిరిగారు. నాలుగంతస్తుల కంట్రోల్‌రూంలో పై అంతస్తులో ఉన్న రాడార్ కంట్రోల్ కమ్ కంప్యూటర్ రూం అది. అప్పుడే సీట్లోకి వచ్చిన రాబర్ట్ ఫోన్ ఎత్తగానే వాయిస్ రికార్డర్‌లో విన్పించిన సమాచారం అతనికి గుండెలో దడ పుట్టించింది.

రాడార్ కంట్రోలర్‌గా సీట్లో కూర్చున్న జాన్ రెడ్ మొహం పాలిపోయి ఉంది. రాబర్ట్ అతన్ని ఇరవైవ సారి ప్రశ్నించాడు నువ్వేం చూసావో వివరించమని.

రెడ్ స్క్రీన్‌మీద సాగిపోతున్న బ్లూకేజిల్‌ని చూస్తున్నాడు. వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయమైన మార్పులూ లేవు. గాలి కూడా సమానవేగంతో వీస్తోంది. ఇంకా బ్లూకేజిల్ తీరం చేరడానికి 10 రోజులు ప్రయాణం చేయవలసి ఉంటుంది. బహుశా ఆటపాటలతో రకరకాల కాంటినెంటల్ వంటకాలతో షిప్ హోరెత్తిపోతూ ఉంటుందని ఊహిస్తూ సన్నగా నవ్వుకున్నాడు. ఆటాపాటా అనగానే రెడ్‌కి అతని లేటెస్ట్ ప్రియురాలు లోధిల్ గుర్తుకొచ్చింది. తను ఫ్రెంచ్ ఇండియన్- నాన్న ఫ్రెంచ్, అమ్మ ఇండియన్. లోధెల్‌కి అమెరికన్ పౌరసత్వం ఉంది. తను అక్కడే పుట్టింది. తెల్లగా, పెద్ద కళ్లతో అమాయకంగా ఉండే లోధెల్ అంటే రెడ్‌కి భలే ఇష్టం. వీకెండ్స్, స్వీట్ ఈవెనింగ్స్ ఇద్దరూ డిస్కోథెక్‌లలో కాలక్షేపం చేస్తారు. సడెన్‌గా స్క్రీన్ మీద రెడ్‌లైట్ వెలిగింది.

జాన్ రెడ్ ఉలిక్కిపడి చూసాడు.

ఏదో ఒక తెల్లటి మేఘం లేదా పొగ లాంటిది బ్లూకేజిల్ చుట్టూ వ్యాపిస్తున్నట్లు గమనించి షిప్ క్రూని ఎలర్ట్ చెయ్యడానికి చకచకా బటన్స్ నొక్కసాగాడు. అయితే అతని మెసేజ్ ఇంకా అక్కడికి చేరకముందే బ్లూకేజిల్ సముద్రంలో సింక్ అవుతున్నట్లు గమనించాడు. ఆశ్చర్యంతో కలిసిన కంగారుతో సీట్లోంచి లేచి నిలబడ్డాడు. సరిగ్గా 10 సెకన్లలో అంత పెద్ద షిప్ సముద్రంలో మునిగిపోయింది. రెడ్ కళ్లు నులుముకుని మళ్లీ చూసేలోగా అసలు అక్కడ ఒక షిప్ ప్రయాణించిన జాడ కూడా లేదు.

జాన్ రెడ్ వెంటనే అలర్ట్ అయ్యి అవసరమైన వాళ్లకి మాత్రం సమాచారం అందించాడు. మీడియాకి సమాచారం అందకుండా ప్రభుత్వం జాగ్రత్తపడింది. బ్లూకేజిల్ తీరం చేరుకోవడానికి ఇంకా పది రోజులుంది కనుక అంతవరకు ప్రయాణికుల బంధువులతో ఇబ్బంది లేదు.

* * *

అది ప్రధాని నివాసానికి దగ్గరగా ఉన్న సీక్రెట్ కాన్ఫరెన్స్ హాల్.

రాబర్ట్- నేవీ చీఫ్, మరికొందరు స్టాఫ్ ప్రధాని రాకకోసం చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

లైట్ బ్రౌన్ సూట్‌లో ప్రధాని వస్తూనే నేవీ చీఫ్‌కి షేక్‌హాండిచ్చారు. పది నిముషాల సమావేశం తరువాత, రాబర్ట్‌ని 'ఆపరేషన్ బ్లూకేజిల్'కి చీఫ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆయనే స్వయంగా సీక్రెట్ ఫైల్స్ ఉన్న లాక్ చేయబడిన సూట్‌కేస్‌ని రాబర్ట్ చేతికిస్తూ...

కొంచెం చిన్నబోయిన స్వరంతో "ఇది మొదటి సారి కాదు ఇలా జరగడం, అప్పుడప్పుడూ జరుగుతున్న ఈ ప్రమాదాలకి కారణం ఏమిటో, నివారణ ఏమిటో తెల్సుకోవడానికి ఎంత ప్రయత్నించినా ఫలించలేదు. దానికి సంబంధించి ఇదివరకు జరిపిన పరిశోధనల తాలూకు ఫైల్ ఇది. దాన్ని బాగా స్టడీ చేసి ఏదైనా ఫలితాన్ని సాధించడానికి ప్రయత్నించు. బెస్టాఫ్‌లక్" అనడం రాబర్ట్‌కి ఒక ప్రక్క ఆశ్చర్యం, మరోప్రక్క అంత బాధ్యతని చేపట్టగలనా అన్న అనుమానం వచ్చాయి.

ఇంతలో అటెండెంట్ వచ్చి మీకు అవసరమైనన్ని రోజులు సెక్యూరిటీ, గెస్ట్‌హౌస్ వాడుకోమని చెప్పి వెళ్లాడు.

రాబర్ట్ నలభై ఏళ్ల బ్రహ్మచారి. వెరైటీగా వంటలు ట్రై చేసి ఆఫీస్‌లో అందరికీ తినిపించడం, బావుంటే నవ్వుకోవడం, బాగోకపోతే తను తప్ప అందరూ నవ్వుకోడం, నేవిగేషన్‌కి సంబంధించి కొత్త విషయాలు సేకరించడం ఇవే అతని హాబీస్. అయితే ప్రధాని రాబర్ట్‌ని సెలక్ట్ చెయ్యడంలో కొంత అంతరార్ధం ఉంది. ఆర్నెల్ల క్రితం ప్రపంచదేశాలన్నీ కలిపి నేవిగేటరీ ఇన్వెన్షన్స్ పేరిట లండన్‌లో జరిపిన కాన్ఫరెన్స్‌కి వాషింగ్టన్ నుంచి రాబర్ట్ ప్రాతినిధ్యం వహించాడు. అందులో క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించిన కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు.

రాబర్ట్ ఒక్కసారిగా గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు. గదిని పరికించి చూసాడు. సెంట్రల్లీ ఎయిర్ కండిషన్డ్ గెస్ట్‌హౌస్ అది. మెరుస్తున్న కుషన్ సోఫాలు, గ్లాస్ ఫర్నిచర్, శాండల్‌వుడ్‌తో పార్టిషన్- వెండి కూజాలు, గ్లాస్‌లతో నిండిన ట్రేలు..టేబుల్ మీద ఎగురుతున్న జెండా, వెండి టేబుల్ లైట్, చిన్న టైంపీస్...మొత్తం మీద ప్రధాని ఆతిథ్యం తాలూకు ప్రభావం కన్పిస్తోంది.

రెండడుగులు ముందుకి వేసి బుల్లెట్‌ప్రూఫ్ తలుపులు ఫిక్స్ చేసిన కిటికీలోనుండి క్రిందికి చూసాడు. నగరమంతా ప్రశాంతంగా చాలా మామూలుగా ఉంది. కానీ ఇప్పుడీ విషయం బైటికి వస్తే ఈ ప్రశాంతత భగ్నమౌతుంది. తిరిగి కుర్చీలో కూర్చుని

ప్రధాని ఇచ్చిన ఫైల్ తెరిచి మిగిలిన విషయాలన్నీ వదిలేసి అంతకు ముందు జరిగిన సంఘటనలు నివేదికలను గురించి పరిశీలన మొదలుపెట్టాడు.

**1926 జనవరి 20వ తేదీ: సాయంత్రం 5 గంటలు**

అట్లాంటిక్ సముద్రం ప్రశాంతంగా నీరెండలో మెరుస్తూ కన్పిస్తోంది. 'ఫెయిర్ లిల్లీ' నౌక వందలమంది ప్రయాణీకులతో నిండు సంద్రం మీద భారంగా తేలుతూ చూడముచ్చటగా కన్పిస్తోంది. సాయంత్రం డ్యూటీలు మారడానికి కంట్రోల్ సిబ్బంది సీట్లలో నుంచి లేచారు. చార్ట్ చూసుకుంటూ సీట్లోకి వచ్చిన కంట్రోలర్‌కి 'ఫెయిర్‌లిల్లీ' స్క్రీన్ మీద కన్పించలేదు. వీడియో రీప్లే చేసి చూస్తే అలల మీద తేలుతున్న షిప్ కన్పిస్తోంది. కంట్రోలర్‌కి మతిపోయినట్లయ్యింది. ఎంత ట్రేస్ చేసినా ఎన్ని మెసేజెస్ పంపినా రిజెక్ట్ అవుతున్నాయి తప్ప చేరడం లేదు. పదే పదే వీడియో రికార్డర్‌ని రీప్లే చేసి జూమ్ చేసినప్పుడు షిప్‌కి పైన ఒక తెల్లటి మేఘం అలుముకోవడం, కొద్ది సెకన్లలో షిప్ అదృశ్యం కావడం గమనించారు. అంతే తప్ప ఎంత ప్రయత్నించినా ఆ స్పాట్‌లో ఏం జరిగిందో అంచనా వెయ్యలేకపోయారు. ఫెయిర్‌లిల్లీలో ప్రయాణీకుల బంధువులు ప్రాణాలిచ్చైనా ఈ రహస్యాన్ని ఛేదించాలని ప్రయత్నించారు కానీ ఉపయోగం లేకపోయింది. ఆ తర్వాత ఆ రూట్‌లో భారీ షిప్స్ ప్రయాణించడం మానేసాయి. అయితే రెగ్యులర్‌గా కాకుండా అప్పుడప్పుడూ మాత్రమే జరిగే ఈ ప్రమాదాలకి కారణం ఎవరూ కనిపెట్టలేకపోయారు.

**1938** జూన్ **11**వ తేదీన బ్లాక్ హార్స్, **1955** ఫిబ్రవరి నెలలో 'జోడియాక్' **1979**లో 'వైట్ మంక్' ఇలా షిప్‌లు మునిగిపోతూనే ఉన్నాయి. ఏం జరిగిందో చెప్పేందుకు ఒక్కరు కూడా మిగలకపోవడం ఒక విషాదమైతే పరిశోధన నిమిత్తం వెళ్లినవారు తిరిగి రాకపోవడం మరో విషాదం.

రాబర్ట్ సిగరెట్ వెలిగించుకుని దానికి జతచేయబడిన నిపుణుల సాక్ష్యాలు, అభిప్రాయాలు అన్నీ క్షుణ్ణంగా చదివాడు. మళ్లీ మళ్లీ చదివాడు.



కథా నిలయం
శ్రీకాకుళం

క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో అతను నేర్చుకున్న విషయం మొట్టమొదట సమస్యను చూసి బెంబేలెత్తి పరిగెత్తకుండా దాన్ని ఎలా సాధించాలో ఆలోచించడం. ఎప్పుడూ ఒకటే ప్రదేశంలో ఈ సంఘటన జరగడం యాదృచ్ఛికమా? లేక ఏదైనా కారణం ఉంటే అది ఎలాంటి కారణం? విదేశాల కుట్ర, ప్రతిపక్షాల పాత్ర లాంటివేమీ కన్పించలేదు.

అనేక రకాల కారణాలని ఊహిస్తూ, అవి జరగడానికి గల పాజిటివ్, నెగటివ్ కోణాలని ఆవిష్కరిస్తూ చాలాసేపు గడిపాడు. ఆలోచిస్తూనే డిన్నర్ ముగించి చాలా ఆలస్యంగా నిద్రలోకి జారుకున్నాడు. లేత నీలిరంగు బెడ్‌లైట్. నీలం పట్టుకర్టెన్లు,


పట్టు పరువు మెత్తదనాన్ని అనుభవిస్తూ ఏ దేవలోకంలోనో దేవకన్య ఒడిలో నిద్రిస్తున్న అనుభూతిని పొందుతున్నాడు రాబర్ట్. లోకమంతా ప్రశాంతంగా నిద్రపోతున్న ఆ సమయంలో ఒక ఆకుపచ్చటి లైట్ మేఘాలనీ, నక్షత్రాలనీ ఛేదించుకుంటూ రాబర్ట్ గదిని చేరుకుంది.

ఒక మృదువైన స్పర్శ, మెత్తటి కంఠస్వరం విన్న రాబర్ట్ దేవలోకంలో నుంచి జారిపడినట్లయ్యి చటుక్కున మేలుకున్నాడు. ఎదురుగా సుమారు తనంత పొడవుగా, కొంచెం నల్లగా నెత్తిమీద పెద్ద జుట్టుముడితో, మెడలో రుద్రాక్షల దండతో కొంచెం విచిత్రమైన ముఖ కవళికలున్న ఆ వ్యక్తిని చూసి షాకయ్యాడు రాబర్ట్..అ ఆకారమే ముందుగా మాట్లాడింది. "నా పేరు మింటో. నేనిక్కడికి కొన్ని లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న 'సిద్నా' గ్రహానికి చెందినవాడిని. మొట్టమొదటగా నీకు నేనే చెప్పేదేమిటంటే మేము మీకు ఏమాత్రం హాని చేయం. నీకప్పగించబడిన ప్రాజెక్టులో నీకు సహాయం చెయ్యాలనే వచ్చాను" అతని గొంతులో నుండి వస్తున్న వైబ్రేషన్స్‌ని అతని మెడ క్రింద భాగంలో ఉన్న మిని ట్రాన్స్‌లేటర్ ఇంగ్లీష్‌లోకి మార్చి చెప్తోంది.

షాక్‌లో నుంచి తేరుకున్న రాబర్ట్ "మీరు ఏ రకమైన సహాయం చెయ్యగలరు?" అంటూ లేచి కూర్చున్నాడు.

"చాలాకాలంగా మీ భూలోక జీవులు మమ్మల్ని మీకు హాని కారకులుగా మీ ఓడలు మాయం కావడానికి మేమే కారణంగా భావిస్తున్నారు. కానీ నిజంగా మీ షిప్స్ ఎందుకు మునిగిపోతున్నాయో నాతో వస్తే నీకు ప్రత్యక్షంగా చూపిస్తాను" అంటున్న మింటోని ప్రశ్నార్థకంగా చూస్తూనే ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు రాబర్ట్. అయిదు నిముషాల తర్వాత ఆకాశంలో మింటోతో పాటు ఎగురుతున్న రాబర్ట్ తనకి ఈ శక్తి ఎలా వచ్చిందా అని ఆశ్చర్యపడేలోగానే మింటో "పూర్వం మీ భూలోక జీవులకి ఇంతకు మించిన శక్తులు ఉండేవి. దివ్యదృష్టి, ఆకాశగమనం, భవిష్యత్‌ని ఖచ్చితంగా ఊహించడం లాంటి విద్యాలన్నీ కేవలం సంకల్పబలంతోనే సిద్ధించాయి మీకు- క్రమంగా జనాభా పెరిగి, కాలుష్యం, సాంకేతిక విజ్ఞానం మీ మెదళ్ల నిండా నిండిపోయి ఈ అద్భుత విద్యలన్నీ పోగొట్టుకున్నారు మీరు" మింటో మాటలు వింటూ అట్లాంటిక్ సముద్రం మీద ఎగురుతున్న రాబర్ట్‌కి అది కలో నిజమో అర్థం కావడం లేదు.

"ఇప్పుడింతకీ మనమేం చెయ్యబోతున్నాం" ఒకింత అయోమయంగా అడిగాడు.




"సముద్రపు అట్టడుగు భాగంలో ఉండే టెక్టానిక్ ప్లేట్స్‌లో రెండు మూడు వేల సంవత్సరాలకి ఒకసారి కలిగే కదలిక వలన సునామీలు, భూకంపాలూ సంభవిస్తాయని నీకు తెలుసు కదా. సామాన్యంగా ఈ టెక్టానిక్ ప్లేట్స్ మూడు సముద్ర ఉపరితలం నుంచి మూడువేల కిలోమీటర్ల లోపు లోతులో ఉంటాయి కానీ మీ బ్లూరేజిల్ షిప్ మునిగిన చోట మట్టిలో సహజంగా ఒక కోత జరిగి టెక్టానిక్ ప్లేట్స్ కేవలం 500 మీటర్ల లోతులోనే ఉన్నాయి. అందుకే చాలా సంవత్సరాలకి ఒకసారి వీటిలో కలిగే చలనం ప్రతి పది పన్నెండేళ్లకీ కలుగుతోంది. పైగా ఈ ప్లేట్స్ చుట్టూ ఏర్పడిన బలమైన అయస్కాంత క్షేత్రం మీకు తెల్లటి పొగలా కన్పిస్తోంది. సెకనులో పదో వంతు మాత్రమే వీటిలో కలిగే కదలిక పెను ఉత్పాతానికి కారణమై మీ షిప్‌లు ఎప్పుడూ అదే చోట మునిగిపోతున్నాయి. అయితే ఇంత తక్కువ సమయంలో జరిగే ఈ పరిణామాలని రికార్డ్ చెయ్యగల సాంకేతిక పరిజ్ఞానం ఇంకా మీ దగ్గరలేదు. మనం ఇప్పుడు సముద్ర అంతర్భాగంలో ఉన్న ఆ ప్లేట్స్‌ని తొలగించి ఇకముందు అసలు ఏ ప్రమాదం రాకుండా నివారించబోతున్నాం" అప్పటికే మింటోతో పాటు వెయ్యి అడుగుల లోతు నీటిలో ఉన్న రాబర్ట్‌కి విచిత్రంగా ఏ శ్వాస సమస్యా లేదు.

"ఆ పనేదో మీరే చెయ్యవచ్చు కదా" నోట్లోకి పోతున్న ఉప్పునీళ్లని ఉమ్ముతూ అడిగాడు రాబర్ట్.

"ఏం జరిగిందో మీకూ తెలియాలి కదా!" మళ్లీ సన్నగా నవ్వాడు మింటో.

సరిగ్గా పదిరోజుల తర్వాత...

ప్రధాని చేతుల మీదుగా 'ఎక్సలెన్సీ అవార్డ్' అందుకుంటూ పైకి చూసాడు రాబర్ట్.

పూలు విసురుతూ అభినందించాడు మింటో.

**(5-7-2007 ఆంధ్రభూమి వీక్లీలో ప్రచురించిన 'బెర్ముడా ట్రయాంగిల్' వ్యాస స్ఫూర్తితో -రచయిత్రి)**

☆

## ముగిసిన ప్రేమకథ?

సల్మాన్ ఖాన్‌తో కత్రినా 'దోస్తీ'కి ఇక తెర పడినట్టే అంటున్నారు బాలీవుడ్ జనాలు. సల్మాన్ తీరుతో వేగలేక ఇదివరలో సంగీతా బిజిలానీ, ఐశ్వర్యారాయ్ లాంటి తారలు అతనికి గుడ్‌బై చెప్పేసిన సంగతి జనాలకి బాగా తెలుసు. ఇటీవల కాలంలో సల్మాన్‌కి చేరువైన కత్రినా క్రమంగా అతని తీరుకి విసిగిపోయి ఇక దూరంగా వుండడం బెటరని భావించిందని ఆమె సన్నిహితుల ఉవాచ. విదేశాలకు షూటింగ్‌లకు వెళ్లిపోయినా, కొత్త సినిమాలు ఒప్పుకునేప్పుడూ సల్మాన్ ఆమెని ప్రశ్నిస్తుండడం కత్రినాకి కాస్తంత చిరాకు కలిగించడం, అదే మెల్లగా మరో ఆలోచనకు దారితీయడంతో ఇక అతనితో పొసగనట్టే అని కత్రినా భావిస్తోందిట.

